# 8. దుర్బలుడు

పేవ్‌మెంట్ మీద నడుస్తూండగా హఠాత్తుగా పాత స్నేహితుడు మణ్యం ఎదురయ్యాడు. వాణ్ని చూసి నాలుగు సంవత్సరాలకుపైగా అవటంవల్ల నా ప్రాణం లేచొచ్చినట్టయింది. ఇద్దరమూ కాఫీతాగి కులాసాగా మాట్లాడుకున్నాం.

"అట్లా బందర్ స్ట్రీట్‌కుపోయి ఏదన్నా కలం కొనాలి–" అన్నాడు మణ్యం.

సరేనని వెళ్లాం. కొట్టువాడు రకరకాల కలాల్నీ మాకు చూపిస్తున్నాడు. మణ్యం చూస్తూ "ఇంకోరకం చూడండి" అంటున్నాడు. ఎంతకూ బేరం తెగకపోవటంవల్ల నాకు విసుగ్గానే వుంది!

చివరకు "యీ నాలుగు రూపాయిల్ది తీసుకుందామా?" అన్నాడు.

"నీ ఇష్టం" అన్నాను.

చప్పున మా కుర్రాడికిక్కూడా (నాకు లేకపోతేపోయె!) ఒక చౌకబారుది కొనాలని గుర్తొచ్చింది.

"కలం బాగున్నట్టేవుంది. నేనూ వొకటి కొనాలి" అన్నాను.

"ఎందుకురా?" అన్నాడు మణ్యం.

"ఎందుకేమిటి – మా వాడికి కావాలి. వాడు చాలా రోజుల్నుంచీ ప్రాణం తీస్తున్నాడు. ఈ చౌకబారుది సరిపోతుందిలే" అన్నాను.

వొద్దంటే వొద్దని పట్టుపట్టాడు. నేను కారణం అడిగాను. వాడు కోపంతో "చెప్తే వినవు. నీకు తోచదు…అసలు నీకు తెలియదు –ఇక్కడ ఇంతసేపూ బేరంచేసి ఏదో

వొకటి కొనకపోతే బాగుండదని ఒక్కటి కొంటూంటే, నువ్వు కూడా నష్టపడటం దేనికీ? ఇవాళా రేపూ ఇది ఎలా రాస్తుందో చూసి, బాగుంటే ఎల్లుండి ఇంకోటి కొనుక్కోరాదాయేం?" అన్నాడు.

ఇంత తేలిగ్గా వాడికి ఎందుకు కోపం వొచ్చిందో నేను ఊహించలేక పొయ్యాను. మా యీ సంభాషణచూసి బహుశా కలియబడబోతున్నా వేమోనని షాపువాడు భయపడుతున్నట్టు తోచింది. అక్కడ వొక దృశ్యాన్ని కల్పించకుండా ఉండేందుకుగాను నేనే తగ్గాను.

ఆ ఒక్క కలానికీ నన్నే డబ్బిమ్మన్నాడు. ఇవ్వకపోతే నా పరువూ, మణ్యంగాడి పరువూ పోతుందని నేనే కక్కాను.

తనకు కలం కావాలని బేరం చెయ్యటమూ, నా చేత పైకం ఇప్పించటమూ నాకు కష్టంగానే వుంది. ఇంకా నయం – ఏ పాతిక, ముప్ఫై రూపాయిల కలమో కొని డబ్బుకు నా దుంప తెంపలేదు....అవతలికి వెళ్లాక, ఆ కలం నాకే ఇస్తాడేమో నన్న ఆశ మిణుకు మిణుకు మనే అవకాశం కలిగింది.

ఇద్దరమూ బైటపడ్డాం. ఫ్లవర్ బజార్ పోలీస్‌స్టేషన్ దాటేదాకా ఇద్దర్లో ఎవరూ మాట్లాడలేదు. మణ్యంగాడు మాత్రం మహావడివడిగా నడుస్తున్నాడు. కారణం అడిగే ధైర్యంలేక నేను కూడా వాడితోపాటే దాదాపు పరుగెత్తాల్సి వొచ్చింది.

బస్ స్టాండ్ దగ్గర ఆగాక "భాయీ! ఒద్దంటే కొనకుండానే ఉండాలి. నాతో ఉన్నావంటే ప్రతిదీ నేను చెప్పినట్టు శిరసావహిస్తూ ఉండాలి. తెలిసిందా?" అన్నాడు.

"కారణమన్నా తెలుసుకోకుండానా?" అన్నాను.

"కారణం అక్కడ చెప్పేది కాదు–"

"ఇప్పుడు చెప్పరాదా?" అన్నాను.

"దగ్గరకురా" అని పిలిచి, నా లాల్చీ జేబులో చెయ్యిపెట్టి మూడు కొత్త కలాల్ని పైకిలాగాడు.

"చూశావా!" అన్నాడు ధీమాగా, తన ప్రతాపాన్ని చూడమన్నట్టు తలపైకి పెట్టి.

"ఇవి ఎక్కడివీ?" అన్నాను ఆశ్చర్యంతో.

"నేనే తీశాను.....నీ జేబులో దాచాను – అక్కణ్నుంచి మనం ఎంత త్వరగా బైటపడితే అంత మంచిదని ఆలోచించి వెళ్దామంటే ఎంతకూ రావు ఎందుకనీ?"

నాకు భూకంపం వొచ్చినట్టుగా తోచింది. ఆ షాపువాడు కనుక పట్టుకున్నట్టయితే ఇంకేమన్నా వుందా? అందులోనూ ఆ కలాలు నా జేబులోనే దొరికేవి. నాకు దేహ శుద్ధి అవటమే కాకుండా, ఫ్లవర్ బజార్ పోలీస్‌స్టేషన్లో నా గతి కుక్కలకూ, నక్కలకూ

ఎరుక! ఆ సమయంలో ఈ మణ్యంగాడు నాకు జామీను ఇచ్చేవాడనే నమ్మకంకూడా నాకు లేదు. మణ్యంగాడి మీద నాకు విపరీతమైన కోపం వొచ్చింది.

అన్నాను : "నీకేమన్నా బుద్ధి వుందా? కలాలు దొంగలించటం మొదటి తప్పు. ఆ పనిచేసిన నువ్వే వాటిని దాచుకున్నట్టయితే సరిపొయ్యేది. వాటిని నా జేబులోవేసి తీరా పట్టుబడితే, నన్నే దొంగగా పట్టించేందుకు అవకాశాన్ని కల్పించటం రెండోతప్పు. మనలాటి పెద్దమనుషులు చెయ్యాల్సిన పనేనా ఇది?"

వాడు వెకిలిగా, నా తెలివితక్కువకు కాబోలు నవ్వాడు. అసలే మండుతూన్న నన్ను మరీ రెచ్చగొడుతూన్న వాడి బుద్ధిహీనతను అర్థంచేసుకోలేక పోతున్నాను.

మణ్యం అన్నాడు : "భాయీ! నాకు లాల్చీ లేదు. నీ పెద్ద జేబు చూశాకనే నాకు ఈ మంచి ఊహ కలిగింది. అంత జేబు వుంటే ఒక చిన్న ఫాన్సీ షాపును ఒకేసారి లేపవొచ్చు - తెలిసిందా? ఇక నేను ఉండగా నీకేం భయం? నువ్వు కలాల్ని కొనటందేనికీ? ఇందులో నువ్వు రెండు తీసుకో. అప్పుడు మనకు ఒక్కో కలం ఒరేఒరు రూపాయికి అతి చౌకగా గిట్టిందన్నమాట... నీ జేబులో పెట్టినవి బేవార్స్‌వి కాదు. పార్కర్ జూనియర్లు! ఒకటి నీకూ ఒకటి మీ వాడికీను-"

రెండు కలాలు నా జేబులోకి నెట్టాడు. లోపల బాధగా ఉన్నా బేవార్స్‌గావొచ్చిన కలాల్ని వొదిలిపెట్టలేక ఆ కలాల్ని ఎవరికీ కనిపించకుండా లోపల వేసుకున్నాను.

"ఇప్పుడు మౌంట్ రోడ్‌లోని కిషన్‌చంద్ చల్లారామ్‌కు వెళ్ళి ఏమన్నా సిల్కులు కొందాం పద" అన్నాడు మణ్యం.

నాకు తత్తరపుట్టింది. వీడికి మరో అవకాశాన్ని కల్పిస్తే సగం షాపు నా జేబులో పెడతాడేమోననే భయం కలిగింది.

ఈసారి పట్టుపడితే ఆ సిల్కుల్తోపాటు యీ కలాలు కూడా పోతయ్యేమోననే కొత్త భయంకూడా పుట్టింది.

"రేపు వెళ్దాంలే-" అని వాణ్ని వొదిలించుకొని ఎలాగో బైటపడ్డాను.

ఆ కలాల్ని చూస్తుంటే - ఆ దొంగ సొమ్మును అనుభవిస్తూంటే ఇలాటి పనికి ఎలా ఒప్పుకోగలిగానో అర్థంకాలేదు. బహుశా ఇది మానవహృదయంలో దుర్బలత్వమే అవుతుందేమో?

- సెప్టెంబర్, *1947*